సాక్షి జనగామ

బుధవారం । 18 । జూన్ । 2025



ఇల్లు లేని కుటుంబం ఉండొద్దు

రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా ఉండొద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

- 8లో▸



తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35°/26°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెట్రోల్‌బంక్ నిర్మాణానికి స్థల పరిశీలన



రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ రోడ్డులో స్వయం కృషి దివ్యాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్‌బంక్ నిర్మాణానికి మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా స్థలాన్ని పరిశీలించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి వసంత, అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దిన్, తహసీల్దార్ మోహిస్సిన్‌ముజ్జిబ, డీపీఎం రాజేంద్రప్రసాద్‌లతో కలిసి కలెక్టర్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 గుంటల స్థలంలో పెట్రోల్ బంకు నిర్మాణానికి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) నుంచి అనుమతి లభించిందన్నారు. సుమారు రూ.70 లక్షలతో నిర్మించనున్న ఈ పెట్రోల్ బంక్ నిర్మాణంతో దివ్యాంగుల మండల సమాఖ్య అభివృద్ధి పథంలో కొనసాగనుందన్నారు. ఆయన వెంట ఏపీఎం సారయ్య, సీసీలు జంపయ్య, రేణుక, లలిత తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



జనగామ: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను చూసిన డీఈఓ వారిని అభినందించి, కష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందించారనే అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సర్కారు అందిస్తున్న సంక్షేమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

భూగర్భ జలాలను పెంచుకోవాలి



నర్మెట/బచ్చన్నపేట: భూగర్భ జలాల పెంపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కేంద్ర జలశక్తి అభియాన్ శాస్త్రవేత్త వెంకటగిరి అన్నారు. మంగళవారం నర్మెట, బచ్చన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రతి ఇంట్లోని నీరు వృథాగా పోకుండా ఇంకుడుగుంతను నిర్మించుకోవాలన్నారు. సంబంధిత ఈజీఎస్ అధికారులు గ్రామాల్లో ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓలు బోడపాటి అరవింద్ చౌదరి, వెంకటమల్లికార్జున్, ఏపీఓలు కృష్ణ, పులుగం రమాదేవి, టీఏ బాబు, కార్యదర్శులు శ్రీధర్, గణేష్, నరేష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నూతన ఫోన్‌నంబర్లు

జనగామ: జనగామ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ ఇంజినీర్ల ఫోన్ నంబర్లు మారినట్లు డీఈ ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాత నంబర్ల స్థానంలో కొత్త సిమ్ కార్డులను ఇవ్వడం జరిగిందని, ఈ నంబర్లను ప్రతీ వినియోగదారుడు తెలుసుకుని సేవలను పొందాలన్నారు.

హోదా	ఫోన్‌నంబర్
ఎస్ఈ,జనగామ	87124 82677
డీఈ	87124 82682
ఏడీఈ	87124 82693
ఏఈ,జనగామ టౌన్–1	87124 82718
ఏఈ,జనగామ టౌన్–2	87124 82719
ఏఈ,జనగామ రూరల్	87124 82720
ఏఈ,పెంబర్తి	87124 82721
ఏఈ,బచ్చన్నపేట	87124 82722
ఏఈ,పడమటికేశ్వార్	87124 82723
ఏడీఈ,దేవరుప్పుల	87124 82695
ఏఈ,దేవరుప్పుల	87124 82724
ఏఈ,సింగరాజుపల్లి	87124 82725
ఏఈ,లింగాలఘణపూర్	87124 82726
ఏడీఈ,రఘునాథపల్లి	87124 82694
ఏఈ,రఘునాథపల్లి	87124 82728
ఏఈ,ఖిలాషాపూర్	87124 82729
ఏఈ,నర్మెట	87124 82730
ఏఈ,తరిగొప్పుల	87124 82731

కనీస వసతులేవి?

- ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుపై నీలినీడలు
- పూర్తిస్థాయిలో వసతులు కల్పించకపోవడంతో ఎన్‌ఎంసీ షోకాజ్
- ఎనిమిది కేటగిరీల్లో లోపాలు ఉన్నట్లు గుర్తింపు
- నేడు విచారణ, వర్చువల్ పద్ధతిలో పాల్గొననున్న ప్రిన్సిపాల్
- సెప్టెంబర్ 15 నుంచి థర్డ్ ఇయర్ ప్రారంభం



నిర్మాణంలో క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవనం

జనగామ: ప్రాథమిక స్థాయిలోనే ప్రతీ విద్యార్థి ఎంబీబీఎస్ చదవాలని కోరుకుంటారు. భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావనే టీచర్ ప్రశ్నకు విద్యార్థి నోటి నుంచి టక్కున వచ్చే జవాబు డాక్టర్. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు డాక్టర్ వృత్తిని కోరుకుంటారు. అంతటి ప్రాధాన్యం కలిగిన వృత్తిపై నీలినీడలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో కనీస వసతి సౌకర్యాలు లేవని జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిపోతుంది. జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు ఈ నెల 14వ తేదీన ఎన్‌ఎంసీ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. 2025–26 నూతన విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుకు సంబంధించి మెడికల్ కళాశాలలో విద్యార్థుల బోధనకు తగ్గట్టుగా సౌకర్యాలు లేవని గుర్తించారు. యూజీఎంఎస్ఆర్–2023 నిబంధనలను అనుసరించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీస మౌలిక వసతి సౌకర్యాలు, అధ్యాపకులు, విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ హాజరు ఎంబీబీఎస్ విద్యార్థుల బోధన సమయంలో సరిపడా రోగులు, ప్రాక్టికల్స్‌కు అవసరమైన మృతదేహాలు ఉండాలి.

కళాశాల నిర్వహణ ఇలా...

జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్ష ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) ఉంది. ప్రస్తుతం ఎంసీహెచ్ ప్రాంగణంలోని తాత్కాలిక రేకుల షెడ్డుల్లో ఏర్పాటు చేసిన మొదటి, ద్వితీయ సంవత్సర ఎంబీబీఎస్ తరగతులు కొనసాగుతున్నాయి. కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమంలో విద్యార్థినులకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించగా, విద్యార్థులు చంపక్‌హిల్స్‌లోని డీఆర్‌డీఓ భవనంలో ఉంటున్నారు. వచ్చే సెప్టెంబర్ 15 నుంచి మూడవ సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో హాస్టల్‌తో పాటు తరగతి బోధనకు జిల్లా ఆస్పత్రి ఎదుట ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆఫీసును అద్దెకు తీసుకునే ఆలోచనలో ఉన్నారు.

100 పడకలతో క్రిటికల్ కేర్

మెడికల్ కళాశాలలో సౌకర్యాలు లేవని ఎన్‌ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఇందులో 90 శాతం మేర త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. 100 పడకలతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. డీహెచ్‌లో సీటీ స్కాన్ సేవలను వారం రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెడికల్ కళాశాలలో 117 పోస్టులకు గాను రెగ్యులర్ ఉద్యోగులు 82, కాంట్రాక్టు 7 మంది విధులు నిర్వర్తిస్తుండగా, 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డు గీతానగర్‌లో నూతనంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనం ఆరునెలల్లో అందుబాటులోకి రానుంది.

ఎనిమిది కేటగిరీల్లో లోపాలు..

జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎనిమిది కేటగిరీల్లో లోపాలు ఉన్నట్లు జాతీయ వైద్య కమిషన్ విచారణలో వెల్లడైంది. మృతదేహాలు, పడకలు, సిటీ స్కాన్, ఎమ్మార్ఐ సేవలు, ఆపరేషన్ థియేటర్లు, ఫారం–16 ఇన్ కంప్లీట్, ఒక డాక్టర్ డిక్లరేషన్‌కు సంబంధించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డీహెచ్, ఎంసీహెచ్‌లో ఎన్‌ఎంసీ నిబంధనలను అనుసరించి 420 వందల బెడ్లకు గాను 20 తక్కువగా ఉన్నాయి. బిగ్, స్మాల్ ఆపరేషన్ థియేటర్లు 12 ఉండాల్సిన చోట 9 మాత్రమే ఉన్నాయి. అలాగే క్రిటికల్ ఆపరేషన్ థియేటర్లు చిన్నవి, పెద్దవి కలిపి 5కు గాను ఒక్కటి లేవు. కొంతమంది డాక్టర్లకు సంబంధించి ఫాం–16 ఇన్‌కంప్లీట్, ఒక డాక్టర్ డిక్లరేషన్ ఇవ్వక పోవడాన్ని అందులో ప్రధానంగా చూపించారు.



జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాల

నేడు వర్చువల్‌గా విచారణ

మెడికల్ కళాశాల నిబంధనలకు సంబంధించి ఢిల్లీలో నేడు (బుధవారం) జరిగే విచారణకు ఆరోగ్య శాఖ కార్యదర్శి, వైద్య విద్య సంచాలకులు హాజరు కావాలని అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు (యూజీఎంఈబీ) ఆదేశించింది. ఈ విచారణలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆయా కళాశాలల నుంచి వర్చువల్‌గా అందుబాటులో ఉండాలని కోరారు.

సమస్యలన్నీ చిన్నవే..



జనగామ మెడికల్ కళాశాలకు ఎన్‌ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఎనిమిది కేటగిరీల్లో లోపాలు ఉన్నట్లు చూపించారు. కళాశాల ప్రారంభ సమయంలో 6 మృతదేహాలు చూపించగా, ఆ తర్వాత మరో నాలుగువచ్చాయి. సీటీ స్కాన్ సేవలు మరో వారం రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. వైద్యుల ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్‌కు సంబంధించి పైనుంచే మిషన్లు రాలేదు. ప్రస్తుతం ఎవరికి వారే సెల్‌ఫోన్ల ద్వారా హాజరు శాతం నమోదు చేసుకుంటున్నారు. ఫారం–16, డాక్టర్ డిక్లరేషన్ కంప్లీట్ చేస్తున్నాం.

– డాక్టర్ గోపాల్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

రూ.62.38 కోట్లు జమ

- రైతుభరోసా మొత్తం రూ.240.22 కోట్లు
- జిల్లాలో 1.98 లక్షల మంది రైతులు
- కొత్త వారికి అవకాశం

జనగామ: ప్రభుత్వం వానాకాలం (2025) రైతుభరోసా పెట్టుబడి సాయం విడుదల చేసింది. జిల్లాలోని 1,98,072 మంది రైతులకు రూ.6వేల చొప్పున రూ.240.22 కోట్ల నిధులను కేటాయించింది. ఇందులో 1,53,966 మంది రైతులకు చెందిన రూ.143.97కోట్ల పెట్టుబడి సాయాన్ని ట్రెజరీకి పంపించింది. ఇప్పటి వరకు 1,06,154 మంది రైతుల బ్యాంకు ఖాతాలో రూ.62.38 కోట్ల మేర నగదు జమ చేశారు. విడుతల వారీగా రైతుల ఖాతాల్లో సాయం జమ కానుంది. ఈసారి కొత్త వారికి కూడా అవకాశం కల్పించారు.

దరఖాస్తు ఇలా

జిల్లాలో 2025 జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా కోసం ఈ నెల 18వ తేదీ(నేటి)లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. రైతు భరోసాకు అర్హత కలిగిన పత్రాలతో క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారిని కలిసి దరఖాస్తు ఇవ్వాలన్నారు. ఈ నెల 5వ తేదీ నాటికి భూ భారతి (ధరణి) పోర్టల్‌లో ఉన్న పట్టాదారుల డేటా ఆధారంగా రైతు భరోసా పథకానికి అర్హత సాధిస్తారన్నారు. గతంలో రైతుబంధు పొందిన రైతులు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

వానాకాలం రైతు భరోసా సాయం వివరాలు (రూ.కోట్లలో)

మండలం	రైతులు	మొత్తం నగదు	ఇప్పటివరకు జమ అయినవి
చిల్పూరు	11,139	10.49	4.52
స్టే.ఘన్‌పూర్	12,618	11.01	5.08
లింగాఘణపురం	12,316	11.49	4.97
రఘునాథపల్లి	17,455	16.57	7.16
జఫర్‌గఢ్	13,093	11.69	5.42
బచ్చన్నపేట	15,058	14.32	6.18
జనగామ	13,206	12.02	5.25
నర్మెట	9,206	8.69	3.80
తరిగొప్పుల	7,098	6.78	2.98
దేవరుప్పుల	14,464	14.31	5.80
కొడకండ్ల	8,573	7.91	3.47
పాలకుర్తి	19,740	18.63	7.72
మొత్తం	1,53,966	143.97	62.38

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సాధించాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్: ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్ల లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్‌లు పింకేశ్‌కుమార్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండవ విడతగా ఐదు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలు అందజేయగా మార్కింగ్ పనులు వేగవంతంగా జరిగిందన్నారు. ఇళ్ల ప్రగతిలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్. వెంకన్న, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంత నాయక్, హౌసింగ్ పీడీ మాతృనాయక్, డీఈ చంద్రశేఖర్, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దివ్యాంగ విద్యార్థులకు అక్షరాభ్యాసం

పాలకుర్తి టౌన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ విద్యార్థుల సమానంగా విద్యాబుద్ధులు నేర్చుకునే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలను వీరికి చేరేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాయం శోభారాణి, చిదురాల శ్రీనివాస్, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు రాజశేఖర్, విజయేందర్, రమేశ్, మల్లికాంబ దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరలో సీటీ స్కాన్ సేవలు!

జనగామ: జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (డీహెచ్)లో సీటీస్కాన్ సేవలను మరో పది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. సీటీ స్కాన్ యంత్రం డీహెచ్‌కు చేరుకుని నెలలు కావస్తుంది. యంత్రం ఇన్‌స్టాలేషన్‌కు సంబంధించి ఏజెన్సీ జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు ఫోన్ చేసి ఆరా తీశారు. సీటీ స్కాన్ సేవలను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో ఓల్డ్ సీటీ స్కాన్ గదిలోనే కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు సంబంధించి పాత మిషన్‌ను తొలగించి, కొత్తగా ఏర్పాటు కోసం గదిలో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల 27వ తేదీలోపు సీటీస్కాన్ సేవలను ప్రారంభించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు మూలన పడి 8 ఏళ్లు గడిచి పోతున్నా, పాత వాటి స్థానంలో కొత్త సేవల ప్రారంభంలో జాప్యంపై 'సాక్షి' లో అనేక కథనాలు ప్రచురితం చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. సీటీస్కాన్ యంత్రం కొనుగోలుకు ఆదేశాలు జారీ చేయగా, ప్రస్తుతం ఇన్‌స్టాలేషన్ దశలో ఉంది. సాక్షి కృషితో కొద్ది రోజుల్లో పేదలకు ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.



మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి అట్రాసిటీ కేసులపై జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన బడ్జెట్ ప్రకారం పెండింగ్ లేకుండా బాధితులకు నష్ట పరిహారం చెల్లిస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి జూలై 15వ తేదీ వరకు జిల్లాలో ఎంపిక చేసిన 9 గ్రామ పంచాయతీల్లో గిరిజనుల సమస్యలపై ప్రధానమంత్రి దర్తీ ఆబ జాన్ భగీదారి అభియాన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఏసీపీ డీఎస్‌డీఓ విక్రమ్, డీపీఓ స్వరూప, రాణా ప్రతాప్, భోజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

పక్కాగా భూగర్భ జలాల నిర్వహణ

భూగర్భ జల వనరుల పరిరక్షణలో జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో భూగర్భ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి భూగర్భ జలాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచడానికి చర్యలు చేపట్టడంతోనే గణనీయంగా మార్పు వచ్చిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి అశోక్, డీఆర్‌డీఓ వసంత, డీపీఓ రామారావు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు కేటాయించాలి

జనగామ రూరల్: పట్టణంలో మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లకు అధికారులు ఇంటి నంబర్లు వేసి కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. మంగళవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ..గత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణంలోని నిరుపేదలకు 114 ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు ఇచ్చారన్నారు. అందులో అనేక ఇబ్బందులు పడి ఇంటి నిర్మాణం చేసుకున్నారని, కానీ ప్రభుత్వం వారి సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య చందు నాయక్ ముసుపట్ల జయ, తేరాల అండాలు, ఏనుగుల కమల, గంగా కౌర్, గంగాధరి సురేష్, సిలివేరి ఉపేందర్, బాలస్వామి, మంద అమల, రాములు, నీల సమ్మక్క, స్వరూప, దానమ్మ, సుజాత, సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలు చేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

లింగాలఘణపురం: దేశ అభివృద్ధి ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొండబోయిన సంపత్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంతో పాటు రాష్ట్రంలో కూడా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, నేషనల్ హైవేల అభివృద్ధి వంటి పనులు జరుగుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాయ ఎల్లయ్య, సోమిడి వెంకట్‌రెడ్డి, నాగరాజు, సతీష్, గణేష్, కార్తీక్, సాయికుమార్, శర్మ, రవి, అనిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్

క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: జూన్ 26 ఒలంపిక్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తుందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒలంపిక్ క్రీడలు ఉదయం 6 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 18వ తేదీన 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, 19న షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్ క్రీడలు, 20న చెస్, క్యారమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సహకారంతో యోగా ఉంటుందని, 23న త్రీ కే రన్ నెహ్రూ పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

రామన్నపేట : వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీజీఈసెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్, క్యాంప్ ఆఫీసర్ బైరి ప్రభాకర్ తెలిపారు. మొదటిరోజు 362 మంది విద్యార్థులు హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. అధికారుల పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ క్రమబద్ధంగా కొనసాగిందని తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

జనగామ రూరల్: ప్రజావ్యతిరే విధానాలపై ప్రజానాట్యమండలి కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐలమ్మనగర్‌లో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నాటక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు భూనాద్రి వెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజానాట్యమండలి కళారూపాలు ప్రజల పక్షాన నిత్యం పోరాడే ఆయుధాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముఖ్య ఘట్టాలను ప్రజల దగ్గరికి తీసుకెళ్లడంలో భాగంగా వీర తెలంగాణ నాటకాన్ని ప్రజానాట్యమండలి జిల్లా కళాకారులు నేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కళారూపాలను జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుంచు విజేందర్, జోగు ప్రకాశ్, శివ ప్రసాద్, నరసింహ స్వామి, బాలమని, ప్రమీల, లత, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా మల్కాపూర్ రోడ్డులోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, 1వ నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో బోధన ఉంటుందన్నారు. పాఠశాలలో చేరే విద్యార్థులకు విద్యతో పాటు భోజన వసతి ఉంటుందన్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్ శిక్షణతో పాటు వివిధ కళల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు 9440550345, 9701190124, నంబర్లను సంప్రదించాలని కోరారు.

సన్మాన సభను విజయవంతం చేయాలి

లింగాలఘణపురం: ఈ నెల 19న హైదరాబాద్ నాగోల్‌లో జరిగే పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సన్మాన సభను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం సోమరాజు కోరారు. మంగళవారం క్లోం గ్రామంలో దివ్యాంగుల ముఖ్యనాయకుల నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల కోసం మంద కృష్ణమాదిగ నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. ఈ సన్మాన కార్యక్రమానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



ఖిలా వరంగల్: తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 23 నుంచి జూలై 01వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాకేజీ -1 (గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర-ఎస్‌సీజెడ్ బీజీ 44) యాత్రలో కాశీ (వారణాసి), అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ రాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించొచ్చు. ఈయాత్ర జూన్ 23వ తేదీన ప్రారంభమై జూలై 01వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్ ధర రూ.16,200, థర్డ్ ఏసీ ధర రూ. 26,500, 2 ఏసీ ధర రూ. 35,000 ఉంటుంది. యాత్ర రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది. ప్రయాణికులకు రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిళ్లు, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శించొచ్చు. అదనపు ఖర్చులు ఏమి ఉండవు. ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయి.అలాగే, రైల్వే స్టేషన్ నుంచి దేవాలయం వరకు ప్రయాణం పూర్తిగా ఉచితం. టికెట్ బుక్ చేసుకోవాలనుకునే వారు వివరాలకు 9701360701 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

- మహిళ మృతి, ఇద్దరికి గాయాలు
- పాలకుర్తిలో ఘటన



చైతన్య మృతదేహం

పాలకుర్తి టౌన్: బైక్ (టీవీ ఎక్సెల్)ను బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన పండుగ చైతన్య(36) తనకున్న భూమిలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం మామ సోమయ్య, కూతురు ప్రవళికతో కలిసి బైక్‌పై పాలకుర్తి మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి బొలెరో ఢీకొనడంతో చైతన్య అక్కడికక్కడే మృతి చెందింది. సోమయ్య, ప్రవళికకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ పేర్కొన్నారు. మృతురాలి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, 2005లో చైతన్య భర్త కుమార్ ట్రాక్టర్ యాక్సిడెంట్‌లో మృతి చెందాడు.

ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం ఓకే

కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదం

- ఇప్పుడే పదోన్నతులకు మాత్రం నో..
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 15 ఎకరాలు కేటాయింపు
- ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్ ఎత్తివేతకు ససేమిరా



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (సర్కారు) తీసుకున్న సానుకూల నిర్ణయంపై కేయూ పాలకమండలి సమావేశం చర్చించి ఆమోదించింది. దీంతో ఎట్టకేలకు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఊరట లభించింది. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఈఏడాది ఫిబ్రవరి 24న అప్పటి సీఎస్‌ను ఆదేశించిన విషయం విధితమే. దీంతో ప్రభుత్వం ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై సానుకూల నిర్ణయం తీసుకుని ఈఏడాది మే 8న ఆ జీఓను కాకతీయ యూనవర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపింది. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆ జీఓపై చర్చించి ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాన్ని ఆమోదించారు. కాగా, 15 సంవత్సరాలుగా ఉద్యోగంలో కొనసాగుతున్నా వీరి నియామకంపై వివాదాల నేపథ్యంలో వీరికి క్యాస్ పదోన్నతులు కల్పించలేదు. అయితే వీరికి పదోన్నతులు చర్చకు రాగా ఇప్పుడే కల్పించొద్దని నిర్ణయించారని తెలిసింది. దీంతో వీరు పదోన్నతుల కోసం కొంతకాలం వేచిచూడకతప్పదు.

యంగ్ఇండియా స్కూల్ కేయూ భూమిలోనే..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 200కోట్లతో నిర్మాణం చేయాల్సింటుంది. అయితే ఈ నియోజకవర్గంలో ఒకే చోట ప్రభుత్వం భూమి 15 నుంచి 20 ఎకరాల వరకు లభించే పరిస్థితి లేదని సమాచారం. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేయూలో 15 ఎకరాల భూమి కేటాయించే అంశంపై కూడా యూనివర్సిటీ అధికారులు ఏజెండాలో పెట్టగా చర్చించి పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం.

స్నాతకోత్సవ నిర్వహణ వ్యయానికి ఓకే..

జూలై 7న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహించబోతున్నారు.అయితే విద్యార్థులకు ఇచ్చే గోల్డ్ మెడల్స్‌పై తొలుత ఫైనాన్స్ కమిటీలో, ఆ తర్వాత పాలకమండలిలో కూడా చర్చ జరిగింది. గోల్డ్‌మెడల్స్ పొందే విద్యార్థులు చాలా మంది ఉన్నారు. ప్రస్తుతం గోల్డ్‌ధర పెరిగినా మెడల్స్ ప్రదానం చేయాల్సిందే. అందుకయ్యే వ్యయానికి తొలుత ఫైనాన్స్ కమిటీలో, ఆ తర్వాత పాలకమండలి సమావేశంలో ఆమోదం లభించింది. స్నాతకోత్సవానికి గవర్నర్ కూడా రానున్నారు. దీంతో స్నాతకోత్సవ నిర్వహణ వ్యయానికి సంబంధించి అంశం ఓకే అయ్యింది.

రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకంపై చర్చ..

కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్న పోస్టులను మినహాయించి మిగితా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల వెకెన్సీల్లో రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకం చేపట్టాలనే అంశం కూడా పాలకమండలి సమావేశంలో చర్చించారని సమాచారం. అందుకు పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం.

ఆ ఇద్దరి సస్పెన్షన్ ఎత్తివేతకు నో..

కేయూ భూమిలో ఓ సర్వే నంబర్‌లో ఇల్లు కలిగి ఉన్నారని, ఇంకా పలు ఆరోపణలతో కొన్నినెలల క్రితం సస్పెన్షన్‌కు గురైన ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఎత్తివేత అంశం చర్చకు వచ్చింది. అయితే అతను ఇప్పటికే కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ ఎత్తివేతకు పాలకమండలి సమావేశం నో చెప్పింది. మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంవత్సరంన్నర క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.అతడిని అప్పట్లోనే యూనివర్సిటీ అధికారులు సస్పెన్షన్ చేశారు. అతడి సస్పెన్షన్ ఎత్తివేతపై పాలకమండలిలో చర్చకురాగా సస్పెన్షన్ ఎత్తివేతకు నో చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఇద్దరికి ఇప్పట్లో ఊరట లభించే అవకాశం కనిపించడం లేదు. ఈ పాలకమండలి సమావేశంలో కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, ఉన్నత విద్యాకమిషనర్ శ్రీదేవసేన, ఫైనాన్స్‌జాయింట్ సెక్రటరీ సుజాత, కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, కేయూ పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేశ్‌లాల్, డాక్టర్ కె. అనితారెడ్డి, పుల్లూరు సుధాకర్, సుకుమారి, ఎం. నవీన్, డాక్టర్ రమ, డాక్టర్ ఎన్ సుదర్శన్, డాక్టర్ చిర్ర రాజు, బాలుచౌహాన్ పాల్గొన్నారు.

ఇల్లు లేని కుటుంబం ఉండొద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ ఎంపీ కడియం కావ్య



ప్రజాసభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సంక్షేమంలో వెనుకంజ వేసేది లేదు

- రైతుల కోసం ఏటా రూ. 70 వేల కోట్లు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పది రోజుల్లో భూపాలపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు
- ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

భూపాలపల్లి : రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా, ఆదాయం లేకుండా ఇబ్బంది పడకుండా చూడడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం చెన్నాపూర్‌లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, కుందూరుపల్లి వద్ద సెంట్రల్ లైటింగ్ పనులను డిప్యూటీ సీఎం మంగళవారం ప్రారంభించారు. అనంతరం మంజూర్‌నగర్‌లో మంజూర్‌నగర్, గణపురం మండలం ధర్మారావుపేట, చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాసభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన వారు ప్రతీ రూపాయి దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, జీవన ప్రమాణాలు పెరగలేదన్నారు. రైతుల సంక్షేమం కోసం ఏటా ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ఐదేళ్ల కాలంలో రూ. 3.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నామన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఇప్పటివరకు ప్రభుత్వం రూ. 16 వేల కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లించిందన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య నందించేందుకు మొదటి దశలో 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ. 11,500 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరిక మేరకు జిల్లాలోని కొత్త మండలాల్లో ఎన్పీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్‌లు, జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ స్టోర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, దుబ్బపల్లి, పరశురాంపల్లి గ్రామాల్లో భూసేకరణ చేపట్టాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు సూచించారు. అనంతరం భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ -2ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి సింగరేణి ప్రాజెక్టుల ఏర్పాటు, బొగ్గు ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైల్వే లైన్ తీసుకొస్తా..

సింగరేణి, కేటీపీపీ పరిశ్రమలు ఉన్న భూపాలపల్లికి రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఇక్కడ జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

పది రోజుల్లో టాస్క్ సెంటర్..

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పది రోజుల్లో భూపాలపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి జిల్లాకు చుక్క నీరు రాలేదని, అయినా అప్పటి భూపాలపల్లి ప్రజాప్రతినిధి, మంథని బీఆర్‌ఎస్ నాయకుడు నోరు మూసుకుని ఉన్నారన్నారు. భూపాలపల్లి జిల్లాలో 47,200 ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

800 మెగావాట్ల ప్లాంటు మంజూరు చేయాలి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో భూపాలపల్లిలో 500, 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించారని, ఇక్కడ బొగ్గు, నీరు పుష్కలంగా ఉన్నాయని, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. సింగరేణి, కేటీపీపీలో స్థానికులు, భూ నిర్వాసితులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సింగరేణి సీఎండీ బలరాంనాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎన్పీడీసీఎల్ సీఈ రాజు చౌహాన్, ఎస్‌ఈ మల్సూర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాటన్ అసోసియేషన్ బాధ్యులు

న్యూశాయంపేట: తెలంగాణలో పత్తి రైతు అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాటన్ కార్పొరేషన్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్ గుప్తా, సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయసేనా, సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీపాణిగ్రహి తదితరులను ముంబాయిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం నుంచి 40లక్షల బేళ్ల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసి రైతులకు మూడురోజుల్లో డబ్బులు చెల్లించిన నేపథ్యంలో చైర్మన్, తదితరులను సన్మానించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధంగా సహకరించాలని ఆయన కోరారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కేయూ క్యాంపస్: టీజీఈసెట్ అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌ఎం రెహమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి పరామర్శ



సత్యవతి రాథోడ్‌ను పరామర్శిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ

మహబూబాబాద్/కురవి: ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను హైదరాబాద్ సోమాజిగూడలోని తన నివాసంలో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు.

కంచ కట్టయ్య జీవితం ఆదర్శం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కంచ కట్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నర్సంపేట: మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం నింపిన కంచ కట్టయ్య (సైన్స్ మనిషి..బిరుదు) జీవితం ఆదర్శమని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు, సైన్స్ శాస్త్రవేత్త కంచ కట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కంచ కట్టయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు వీడి కంచ కట్టయ్య జీవితాన్ని ఆదర్శం తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ వీరన్నయాదవ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులు సుభాశ్, కంపాటి వీరయ్య, ఓయూ జేఏసీ నాయకులు కొంగళపాండు కురుమ, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాడి రమేశ్, వెంకట్‌నాయక్, మేకల శివ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో నియోజకవర్గ అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసా వంటి పథకాల అమలుపై మంత్రి ప్రభాకర్ చర్చించారు.

బీపీఈడీలో రైతుబిడ్డకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

- క్రీడల్లో ప్రతిభ కనబర్చిన జ్యోతిర్మయి
- తల్లిదండ్రులు, గ్రామస్తుల హర్షం



జ్యోతిర్మయి

ఏటూరునాగారం: బీపీఈడీలో రైతుబిడ్డ సత్తా చాటింది. టీజీ పీఈసీఈటీ-2025 ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రొయ్యూరుకు చెందిన రైతు రామయ్య, కుమారి దంపతుల కూతురు జ్యోతిర్మయి ఈ నెల 13వ తేదీన టీజీ పీఈసీఈటీ-2025 (తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) రాసింది. ఈ క్రమంలో మంగళవారం విడుదలైన ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో తల్లిదండ్రులు రామయ్య, కుమారి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, జ్యోతిర్మయి రొయ్యూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ 5వ తరగతిలో రాయపర్తి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో సీటు సాధించింది. ఐదు నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకుంది. అయితే క్రీడలపై మక్కువతో 9వ తరగతిలో రంగారెడ్డి జిల్లా కమ్మదను సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ అకాడమీలో కోచ్ హబీద్ హుస్సేన్ వద్ద శిక్షణ తీసుకుంది. అనంతరం పాలమూరు యూనివర్సిటీ డిగ్రీ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల బీపీఈడీ (వ్యాయామ) ప్రవేశ పరీక్ష రాసింది. ఇందులో స్టేట్ ర్యాంక్‌ను సాధించింది. కాగా, బీపీఈడీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు సంతోషంగా ఉందని జ్యోతిర్మయి తెలిపింది.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు బాలకార్మికుడు బలి..

- నిద్రిస్తున్న బాలుడిపై నుంచి వెళ్లిన బోరువాహనం
- అక్కడికక్కడే మృతి.. మిర్యాలపెంట సమీపంలో ఘటన



హిడ్మా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

బయ్యారం: నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ బాలకార్మికుడిని బలి తీసుకుంది. బాలుడిని పనిలో పెట్టుకోవడమే నేరం కాగా అలసిపోయి నిద్రిస్తున్న ఆ చిన్నారిపై నుంచి బోరువాహనం వెళ్లడంతో నిద్రలోనే అనంత లోకాలకు వెళ్లాడు. ఈ హృదయవిధారకర ఘటన మంగళవారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన ధారావత్ భాస్కర్ బోరువాహనంపై పని చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా నీలవరం గ్రామానికి చెందిన కబాతి హిడ్మా(14) పదిరోజుల క్రితం మేనమామ సుక్కతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో బయ్యారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో బోరువేస్తుండగా హిడ్మా ఆ వాహనం కింద నిద్రపోయాడు. ఇది గమనించకుండా వాహన డ్రైవర్ భూక్య భాస్కర్ వెనకకు తిప్పడంతో హిడ్మా తలపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ సుక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

- ఇస్రా తండాలో ఘటన



రంగమ్మ మృతదేహం

నెల్లికుదురు: మద్యం మత్తులో భర్త క్షణికావేశంలో భార్యను హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం హేమ్లాతండా శివారు ఇస్రా తండాలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం. తండాకు చెందిన బానోత్ భద్రు, రంగమ్మ (55) దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా గొడవ జరిగింది. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న భద్రు క్షణికావేశంలో రంగమ్మను గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం క్షణికావేశంలో తానే హత్య చేశానని తండావాసుల ముందు ఒప్పుకున్నాడు. ఈ ఘటనపై మృతురాలి కూతురు వాంకుడోతు శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశ రక్షణ కోసం యువతను సిద్ధం చేయాలి

- తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలాని
- వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ సందర్శన



వరంగల్, ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ అధికారులతో నర్సింగ్ సైలాని

కాజీపేట రూరల్/మామునూరు/విద్యారణ్యపురి : దేశ రక్షణ కోసం యువతను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సైలానికి వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ నింబాకర్ వీరచక్ర స్వాగతం పలికారు. రెండు రాష్ట్రాల బాధ్యతలు చేపట్టిన నర్సింగ్ సైలాని గ్రూప్‌హెడ్‌క్వార్టర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఎన్‌సీసీ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశ రక్షణ రక్షణ కోసం యువత సైన్యంలో పాల్గొనేలా సన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రూప్ శిక్షణ విధానాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ పద్ధతులు, క్యాంప్ నిర్వహణ, పరిపాలన విధానాలు చూసి అభినందించారు. ఎక్సైజ్‌కాలనీలోని ఆర్మీ మెస్‌కు వెళ్లి అక్కడ జవాన్లతో కలిసి భోజనం చేశారు. అనంతరం 10వ తెలంగాణ బెటాలియన్, 1వ తెలంగాణ బెటాలియన్, 4వ ఎయిర్ ఫోర్స్ బెటాలియన్, మామునూరు పీటీసీ క్యాంప్‌ను సందర్శించారు. కాగా, నర్సింగ్ సైలాని బుధవారం ఖమ్మం బెటాలియన్‌ను సందర్శిస్తారని గ్రూప్ కమాండర్ సచిన్ నింబాకర్ తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు రాహుల్ సింగ్, ఎస్‌ఎం. రియాజ్, కల్నల్ పిప్పి కిశోర్, కల్నల్ ఎస్.ఎస్.రామదురై, విజయ్‌కుమార్, 'టి' వింగ్ కమాండర్ ఆశీష్ భాస్కర్, 'డి' వింగ్ కమాండర్ వి.కె.ఆర్య, కల్నల్ రవీంద్రకుమార్, లెఫ్టినెంట్ రవి సునారి, కల్నల్ సంజయ్‌కుమార్, కల్నల్ నవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో రాణిస్తే భవిష్యత్..

క్రమశిక్షణ, సామాజిక సేవభావంతో ఎన్‌సీసీలో రాణిస్తే క్యాడెట్‌కు భవిష్యత్ ఉంటుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని పోలీసు శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 8వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం పదోరోజుకు చేరుకుంది. క్యాడెట్లకు బ్యాలెన్స్ జంప్, వాల్‌జంప్, రన్నింగ్, డ్రిల్, మ్యాప్‌రీడింగ్,ఫైరింగ్, ఆయుధ శిక్షణ ఇచ్చారు. నర్సింగ్ సైలాని ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. సమావేశంలో 8వ బెటాలియన్ కమొడర్ కల్నల్ రవీంద్రకుమార్, 615మంది క్యాడెట్లు పాల్గొన్నారు.